అనుగ్రహానికి పాత్రులవుతారు అని బాబాచెప్పారు. మనం బాబాపాదాలను ఆశ్రయించి, ఆయన నామాన్ని స్మరించుకోవటంవలన, ఆయన రూపాన్ని ధ్యానించుకోవటం వలన అజ్ఞానంలోనుండి విడుదల పొందటానికి ఆయన సహాయసహకారములు అందుతాయి. కేవలం మన ప్రయత్నం వలన అజ్ఞానంలోనుండి విడుదలపొందలేము, ఆయన సహాయం అవసరం, మనంచేసే ప్రయత్నం వ్యవహారిక సత్యం, బాబాయొక్క అనుగ్రహం పారమార్థిక సత్యం. ఇటుకకు ఇటుకకు మధ్యసిమ్మెంటు ఎలా అంటిపెట్టుకొని ఉంటుందో అలాగ గురువుకి శిష్యుడికి మధ్య ప్రేమ అనుబంధం అలా ఉండాలి అని బాబా చెప్పారు.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 2-7-04, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు గురుపూర్ణిమ, వ్యాసుడుయొక్క జన్మదినమును గురుపూర్ణిమగా జరుపుకొంటున్నాము. ప్రతీ గురువు బోధస్వరూపుడై ఉంటే సరిపోదు, ఆయన అనుగ్రహ స్వరూపుడై ఉండాలి. గురువుకు మూడు నేత్రాలు, నాలుగు చేతులు, తలకాయలు లేకపోయిన ఆయన శివుడితో, విష్ణువుతో, బ్రహ్మదేవుడితో సమానమని, శివుడుచేసేపని, విష్ణువుచేసేపని, బ్రహ్మదేవుడు చేసేపని గురువు చేస్తాడు అని చెపుతారు. రమణ మహర్షిగారికి అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడే గురువు. మీకు ఏదైనా సందేహం ఉంటే భగవాన్ నోటితో చెప్పకుండానే ఆయన మీలోపల అంతార్యమిగా ఉన్నాడు కాబట్టి లోపల నుండే సందేహనివృత్తి చేసేవాడు. అది గురువు యొక్క వైభవం. మనలను భగవంతుడిలో ఐక్యంచేసేవాడే గురువు. జననమరణచక్రంలో నుండి బయటకురావటానికి గురువు యొక్క పాదాలు నావలాగ ఉపయోగపడతాయి. మన బంధువులతోటి, స్నేహితులతోటి, పరిసరాలతోటి, పార్టీలతోటి మనకు ఉన్న అనుబంధం అసత్యము, అది అంతామిథ్య, కళ్ళు మూస్తే ఏమీలేదు. మనకు గురువుతోఉన్న అనుబంధం జన్మజన్మలకు కంటిన్యూ అవుతుంది. మనం ఎక్కడ జన్మించినా గురువు చేత ఆకర్షింపబడతాము. దేహాన్ని బట్టే స్నేహితులు, బంధువులు, విరోధులు, ప్రియం, అప్రియం. ఇవిఅన్నీకూడా దేహంతో తాదాప్యం పొందే తలంపు మీద ఆధారపడ్డవిషయాలు. మనం ఏరోజునయితే దైవాన్ని స్మరించమో, మనకు ఏరోజునయితే గురువు యొక్క ధ్యాసలేదో ఆరోజు మనం చనిపోయిన వాడితో సమానము. వ్యాసుడి ఋణం మనం తీర్చుకోలేము. ఆయన వేదాలను విభజించాడు, ప్రచారం చేసాడు. ఉపనిషత్‌ల సారాన్ని కృష్ణుడు భగవద్గీతగా ఎలా చెప్పాడో, వ్యాసుడు బ్రహ్మసూత్రాలు చెప్పాడు. సూత్రం అంటే చాలా విశాలమైన అర్థాన్ని చాలా తక్కువ మాటలలో పొదిగివ్రాస్తారు. బ్రహ్మసూత్రాలనే వ్యాససూత్రాలు అని కూడా పిలుస్తారు అంటే వ్యాసుడు చేత రచింపబడినవి.



వ్యాసుడు జ్ఞానసముద్రుడు అందుచేత మనం ప్రతీరోజు ఆయనను స్మరించుకోవలసిందే.

గురువు చెప్పినమాటలను శ్రద్ధగా శ్రవణం చేయాలి. శ్రవణం చేసిన ఆ మాటలను అనుసరించాలి. ఆమాటలను అనుసరించి, అర్థంచేసుకొని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేయాలి, అనుభవంలోనికి వస్తే జ్ఞానంయొక్కవిలువ, శాంతియొక్క విలువ అప్పడు మనకు తెలుస్తుంది. ఈ ప్రపంచంలో అన్ని లాభాలకంటే ఏది గొప్పలాభం అని వ్యాసుడు ప్రశ్నించాడు. మీకు భౌతికంగా ఏదైనా లాభం వచ్చినా అది అసత్యం అని చెప్పాడు. ఒకవేళ భౌతికంగా మీకు వచ్చిన లాభాలు సత్యం అనుకొంటారు అనుకోండి. ఈసత్యము దగ్గర ఆగిపోవద్దు. ఈసత్యంనుండి, ఏ సత్యంను తెలుసుకొంటే నీవు అజ్ఞానంలోనుండి విడుదలపొందుతావో ఆ సత్యంలోనికి ప్రయాణంచెయ్యి. ఈ ప్రపంచంలో అన్నిలాభాలకంటే ఆత్మలాభం గొప్పలాభం అని వ్యాసుడు చెప్పాడు. ఆత్మ అంటే దాని స్వరూపం జ్ఞానం, దాని స్వరూపం ఆనందం, దాని స్వరూపం శాంతి, అది ఎప్పడూ ఉండేది. అది మనలో ఉంది. మనలో ఉన్నదే అంతటా ఉంది, అంతటా ఉన్నదే మనలోను ఉంది అది మనకు ఎందుకు తెలియటంలేదు అంటే మనం ఆడంబరజీవితంలోనుండి బయటకు రావటంలేదు, మనకు తపస్సులేదు, మాట దగ్గర నిగ్రహంలేదు, చేతదగ్గర పొందికలేదు, జన్మించినది మొదలు మరణించేవరకు మనం నామరూపాల చుట్టూ తిరుగుతున్నాము అందుచేతనే ఆవస్తువు గురించి మనకు తెలియటంలేదు. ఈ దేహం భూమిమీద తిరుగుతున్నప్పడే ఎవడైతే నామరూపముల నుండి విడుదలపొందుతాడో వాడికి లోపలఉన్న సత్యము స్పష్టముగా గోచరిస్తుంది. దేహాభిమానం లేకపోతే మనిషికి దుఃఖంలేదు, దేహాభిమానం తగ్గించుకోవటానికి ప్రయత్నం చేయాలి, అదికూడా సాధనలో ఒక భాగము. ఏ సుఖాన్ని పొందిన తరువాత దానికిమించిన సుఖంగాని, దానితో సమానమైన సుఖంగాని లేదు అని మనకు స్ఫురిస్తుందో దానిమీద మన గమ్యం పెట్టుకోవాలి కాని తాత్కాలికంగా వచ్చే సంతోషాలు, దుఃఖాలు, లాభాలు, నష్టాలకు మనం పరిమితం అవ్వకూడదు. భౌతికంగా ఒక వ్యక్తిమీదగాని, ఒక సంఘటన మీదగాని ఆధారపడి మీరు సంతోషం తెచ్చుకొంటే అది పరిణామంలో తప్పనిసరిగా దుఃఖంగా మారుతుంది, ఇందులో సందేహం లేదు. ప్రపంచంలో ఏవస్తువుకు విలువలేదు ముందు అది గ్రహించాలి. నాకు కోరిక ఉంటే ప్రపంచంలో ఉన్న వస్తువు నాకు గొప్పగా కనిపిస్తుంది, ఆకోరికలేకపోతే ఏమీలేదు, అది సున్న అని మనకు తెలుస్తుంది. నీకు కోరిక ఉంటే అది గొప్పగా కనిపిస్తుంది. అది అసత్యం అయినా సత్యం కింద నీకు కనిపిస్తుంది. అందులో ఏమీలేదు అని దానిని పొందాక నీకు తెలుస్తుంది, ప్రతీజన్మలోను మనంచేసే పని ఇదే. నీకుతోచినట్లు చేయటంకాదు, శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించు అని గీతలో

భగవంతుడు చెప్పాడు. దైవప్రార్థనవలన నిగ్రహం వస్తుంది. మనిషికి ఎంతో కొంత నిగ్రహం లేకపోతే వాడు ఏరంగంలోను అభివృద్ధిలోనికి రాలేడు. దైవప్రార్థన ఏమిచేస్తుంది అంటే మనకు తెలియని వస్తువును తెలుసుకోవటానికి మనకు ప్రేరణ కలుగజేస్తుంది. భగవంతుడు చెప్పిన మాట మీద మనకు నమ్మకం కుదరటంలేదు, దానికి మనలో ఉన్న పాపం కారణం.

ఈశ్వరుడు అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాడు, పనిచేస్తున్నాడు, ఈ సృష్టినంతానడిపేవాడు ఆయనే. అర్జునా! ఈ దేహదారులందరిలోను నేను అంతర్యామిగా ఉన్నాను. ఆదేహం యొక్క ప్రారబ్దాన్ని బట్టి ఆ శరీరాలను త్రిప్పతున్నాను అని భగవంతుడు గీతలో చెప్పాడు. ఈ ఒక్క శ్లోకం మీకు అర్థమయితే చాలు. మీ శరీరం ద్వారా ఏపని జరగాలి. మీ శరీరం ఎప్పడు మరణించాలి, మీ శరీరం ద్వారా ఏ అనుభవాలు పొందాలి అన్నీకూడా ఒక పుల్‌స్టాప్, కామాకూడా తేడా లేకుండా అంతఫెరఫెక్టుగా జరిగేలా ఆయన చూస్తాడు. ఇప్పడు మనకు ఒక కష్టం కలిగింది అనుకోండి అది అంతర్యామిగాఉన్న ఈశ్వరుడికి తెలియకుండా ఆకష్టం కలగటానికి అవకాశంలేదు. మనం ఆకష్టంద్వారా, ఆదుఃఖంద్వారా, ఆ అశాంతిద్వారా నేర్చుకోవలసిన పాఠాలు ఉన్నాయి. ఆపాఠాలు నేర్చేవరకు వాటిని అక్కడ ఉంచి తరువాత తీసేస్తాడు. అప్పటివరకు తీయడు. మనకు బుద్ధివచ్చేవరకు మొట్టికాయలు మొట్టి అప్పడు ఆపుచేస్తాడు. మనం ఎవరికోసమైతే కష్టపడతున్నామో, ఎవరిని ప్రేమిస్తున్నామో, మనకు ఎవరి మీద మమకారం ఉందో ఒకోసారి సడన్‌గా వారే మనకు విరోధులవుతారు. ఏమిటి వీరుఇలాగ అయ్యారు అని మనకు అనిపిస్తుంది కాని అది ఈశ్వరుడికి తెలియదా? నీకు వారిమీద మమకారం తగ్గించటానికి ఈశ్వరుడి ప్రణాళిక అది. జరిగే సంఘటనలవలన లాభం రానియ్యి, నష్టంరానియ్యి ఏది వచ్చినా అది ఈశ్వరుడికి తెలియకుండా రావటంలేదు. దానివలన నీవు నేర్చుకోవలసిన పాఠాలు ఉన్నాయి, అది గ్రహించు నువ్వుకాలేజిలో, స్కూలులో చదివి నేర్చుకొనే పాఠాలకంటే ప్రకృతి నేర్పే పాఠాలు, జీవితం నేర్పే పాఠాలు ఎక్కువ ఉంటాయి. మంచిచేసిన వాడికి దుర్గతిలేదు అని పరమాత్మ గీతలో చెప్పాడు. మనం ఎప్పడైతే మంచిని వదిలేసామో అప్పడు చెడ్డలో పడిపోతాము. కోరికను దృష్టిలో పెట్టుకొని పనిచెయ్యకు. కోరికతో సంబంధం లేకుండా వచ్చిన ఫలితం నీకు అపకారం చెయ్యదు. పనిద్వారా మనం పొందవలసిన శిక్షణ చాలా ఉంది. పనిని విడిచిపెట్టమని కాదు, కోరికతో చేసే పనిని సన్యసించమని భగవంతుడు చెప్పాడు. మనం భక్తిని పూజగదికి, వంటిగదికి పరిమితం చేయకూడదు. ప్రార్థన వలన ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం వస్తుంది, సూక్ష్మబుద్ధి కలుగుతుంది, దైవానికి సన్నిహితం అవుతాము, ఇహానికి దూరమవుతాము. ఒక రోజు భోజనం లేకుండా ఉండగలనుగాని



ఈశ్వరుడిని ప్రార్థించకుండా ఒక్కరోజుకూడా ఉండలేను అని గాంధీగారు అనేవారు. దేహానికి భోజనం ఎంత అవసరమో అంతకంటే కూడా మనస్సుకు ప్రార్థన అవసరం. శరీరం మరణించిన వెంటనే జీవితయాత్ర ముగిసిపోతుంది అని భౌతికవాదులు అనుకొంటారు. శరీరం మరణించినప్పడు శరీరగతమైన యాత్ర ముగుస్తుంది కాని జీవితయాత్ర ముగియదు, ఇంకో శరీరంలో జీవితం కంటిన్యూ అవుతుంది. చనిపోవటం అంటే ఆదేహగతమైనయాత్ర ముగిస్తుంది అంటే ఆదేహం అక్కడితో ఆగిపోతుంది. చుట్టాలు, స్నేహితులు అక్కడితో తెగిపోతారు అంతేగాని జీవుడియాత్ర కొనసాగుతుంది. ఒక అమెరికన్ సైంటిస్టు భగవాన్ దగ్గరకు వచ్చి పది నిమిషాలు కూర్చొన్నాడు. ఆయన భగవాన్‌తో ఏమీ మాట్లాడలేదు. భగవాన్ ఆయనతో ఏమీ మాట్లాడలేదు. ఈదేహం ఎప్పడయితే మరణించిందో అప్పడు జీవితం ముగిసిపోతుంది అని ఇంతవరకు అనుకొనేవాడిని కాని ఈ ఋషి సమక్షంలో కూర్చొన్నప్పడు ఈశరీరం నేనుకాదని, ఈ ప్రాణంనేనుకాదని, ఆలోచించే బుద్ధిని నేనుకాదని, చాపల్యంగా తిరిగే మనస్సును నేనుకాదని వీటితో కించెత్తుకూడా సంబంధం లేకుండా నాహృదయంలో ఏదో నిజం ఉందని నాకు స్ఫురించింది. ఈఋషి ఆపనిని నాకు సైలెంట్‌గా చేసిపెడుతున్నాడు. ఆయన సహాయ సహకారములు నాకు అందుతున్నట్లు నాకు తెలుస్తోంది కాని తెలియాలి అని ఆయన అనుకోవటం లేదు అని ఆసైంటిస్టు చెప్పాడు. హృదయం హృదయంతో మాట్లాడేటప్పడు, ఆ ఆప్యాయత ఉన్నప్పడు మాటలతో పనిఏముంది. మనకు ఆప్యాయత, ప్రేమ తక్కువ అయినప్పడు కల్పించుకొని మాట్లాడాలి. మనకు అవసరంలేని మాటలు మాట్లాడుతూ ఉంటే అవి మనకు క్షోభను తెచ్చిపెడతాయి. నీ హృదయంలో ఒక నిజం ఉంది. అక్కడకు వెళ్ళేవరకు ఈ జన్మలలోనుండి, వికారములలోనుండి, ఈ ప్రకృతిగుణాలలో నుండి మనం విడుదలపొందలేము. నీ హృదయంలో ఉన్న నిజం గురించి నీకు తెలియజేసి, అక్కడకు చేర్చేవాడే గురువు. నీ హృదయంలో ఉన్న నిజం నీకు తెలిసేవరకు ఏజన్మకు ఆజన్మ నిజం కానిది నిజం అని అనుకొంటూఉంటావు. ఎప్పడో గురువు ఇంటర్‌ఫియర్ అవ్వాలి. మనం ఏదో కొంచం ప్రయత్నం చేసినా ఆయన కలుగుజేసుకొని జ్ఞానాన్ని ఇచ్చేస్తాడు, వాడు గురువు అని భగవాన్ చెప్పారు. హంసకాకితో స్నేహం చేస్తుంది అనుకోండి. హంస గుణాలు కాకికిరావు కాని కాకిగుణాలు అన్నీ హంసకు వచ్చేస్తాయి అని ఒక మహాత్ముడు చెప్పాడు అంటే దుర్జనుడితో సహవాసంవలన సజ్జనుడు పాడైపోతాడు అని చెప్పటం, దుర్జనుడు సజ్జనుడు అవ్వకపోయిన సజ్జనుడు మాత్రం దుర్జనుడు అయిపోతాడు, ఆ సహవాసం యొక్కవేగం అటువంటిది అని చెప్పటం. మనకు ఎక్కువగా పనికిరానితలంపులు వస్తూఉంటాయి. అవి ఇహానికి పనికిరావు, పరానికి పనికిరావు. వ్యర్థమైనచింతలు, కోరికలు, ప్రపంచంలోఉన్న

దెయ్యాలన్నీ నీతలలో కాపురం ఉంటాయి. మన బుర్ర దేవుడికి వర్కుషాపుకాదు, దెయ్యాలకు వర్కుషాపుగా ఉంది. భగవంతుడి నామాన్ని స్మరించటంవలన ఆయన సాక్షాత్కారం అయినా, అవ్వకపోయినా ముందు ఈ వ్యర్థమైన గొడవలు, దెయ్యాలు అన్నీ కూడా నీ తలలో కాపురం ఉండకుండా జపం ఆపుచేస్తుంది.

రామనామాన్ని తారకనామం అంటారు. తారకనామం అంటే తరింపచేసేది, రక్షించేది. రాముడియొక్క నామం, ఆయన కళ్యాణగుణాలు ఒక్కసారి స్మరించేటప్పటికి మనస్సు పల్చబడిపోతుంది, చిరిగిపోతుంది. రాముడిలో గొప్పతనం ఏమిటి అంటే ఎక్కడా రియాక్షన్ కనబడదు. మనకు అసలు విశ్వాసం ఉండాలి గాని ఒక్క విశాస్వమే మన హృదయంలో ఉన్న నిజం దగ్గరకు తోలుకొనిపోతుంది. ఏతలంపులయితే నిన్ను దుఃఖానికి, వేదనకు గురిచేస్తున్నాయో ఆతలంపులనుండి జపధ్యానములు నిన్ను విడుదలచేస్తాయి అందుచేత జపధ్యానములు విడిచిపెట్టవద్దు. గాంధీగారు రామనామం బాగా ప్రాక్టీసు చేసారు. గాంధీగారిని పేల్చినప్పుడు హేరామ్, హేరామ్ అన్నారు. ఎందుచేతనంటే గాంధీగారి ఎముకలను, రక్తాన్ని, మాంసాన్ని, ఆయన మనస్సును, గుండెను అంతా రామనామం పట్టేసింది. గాంధీగారికి గురువు ఎవరు అంటే వాళ్ల ఇంట్లో పనిమనిషి ఆయనకు గురువు. రామనామం గురించి ఆవిడే గాంధీగారికి చెప్పింది. అందుచేత ఆయన జీవితం పొడుగునా ఆమెను మర్చిపోలేదు. కాలుజారకుండా నువ్వు ఎంత జాగ్రత్తపడతావో పెదాలు జారకుండా కూడా అంత జాగ్రత్తపడు అన్నారు భగవాన్. అంటే ఉపయోగం లేనిమాట ఒక్కమాట కూడా నీవు మాట్లాడవద్దు అన్నారు. ఒకవేళ కాలుజారినా, నోరుమాత్రం జారకూడదు, ఇదంతా తపస్సులో భాగము. మనం దేవాలయంకు వెళతాము అనుకోండి. అక్కడ అవసరంలేని పెంకుముక్కలు, చెత్త ఉన్నాయి అనుకోండి. వాటిని మనచేత్తో తీసేసి ప్రక్కన పెడతాము అనుకోండి, అదికూడా తపస్సులో భాగమే. మనం స్వార్థలేకుండా ఏపని చేసినా అది తపస్సే. ఇప్పుడు మనం చేసేది ఏమిటి అంటే ఇంట్లో దుమ్ము అంతా తీసుకొనివెళ్లి మెయిన్‌రోడ్డు మీద వేస్తాము అంటే రోడ్డు పాడైపోయినా ఫరవాలేదు మన ఇల్లు బాగుంటేచాలు. ఇది మన దేశభక్తి ఇది మనం చేసే తపస్సు. భగవంతుడికి గుహేశుడు అని పేరు ఉంది అంటే హృదయగుహలో ఉన్న ఈశ్వరుడు. మిగతా బయట కనిపించే దేవుళ్ళు అందరూ మన శరీరం ఎంత నిజమో, మన మనస్సు ఎంత నిజమో వారూ అంతేనిజం. మనకు వచ్చే ప్రతీతలంపుకు ఈనాటికైనా, ఏనాటికైనా, రాబోయే జన్మలో అయినా మనం జవాబు చెప్పి తీరాలి, ఇందులో రాజీలేదు, ఇది రంపపుకోత. నువ్వు భక్తిపూర్వకంగా, విశ్వాసంతో పూజ, జపం, ధ్యానం చేస్తూ ఉంటే నువ్వు కానిదానిలో నుండి విడుదల పొందుతావు. నువ్వు



ఎప్పుడైతే కానిదానిలో నుండి విడుదల పొందావో నువ్వు హృదయగుహలో పడిపోతావు. పాములను, తేళ్లను ఇటువంటి విషజంతువులను చంపినాదోషంలేదు, పాపంలేదు అని భాగవతంలో ఒకమాట ఉంది, కాని గాంధీగారు అదికూడా అంగీకరించలేదు. పాముచేత కరవబడి చనిపోయే ప్రారబ్దం కనుక వాడికి ఉంటే వాడు మారుమూల ఉన్నా, మంచంమీద ఉన్నా పాము చేత కరవబడి చనిపోతాడు అనిచెప్పారు.

మన గమ్యం ఏమిటి? కాశీవెళ్లటం, రామేశ్వరం వెళ్లటంకాదు. మన హృదయగుహలోనికి మనస్సును ఉపసంహరించాలి. మనస్సును ఉపసంహరించి, ఉపసంహరించి దానిని హృదయగుహలోనికి పంపాలి. హృదయగుహలో ఈశ్వరుడు ఉన్నాడు. ఆయన మంచికి బహుమానం ఇస్తాడు, చెడుకు పనిష్‌మెంట్ ఇస్తాడు. కాని ఇవిఅన్నీ వ్యవహారికసత్యం. జ్ఞానదాత, శాంతిదాత మన హృదయంలోనే ఉన్నాడు, కాని మన దేహబుద్ధివలన ఎక్కడో ఉన్నాడు అని మనకు అనిపిస్తుంది. మన హృదయంలో ఉన్న గుహేశుడికి పూర్తిగా శరణాగతి చెంది నాకు జ్ఞానమే కావాలి. నాకు శాంతే కావాలి అని అడిగితే భగవంతుడు మనం ఏది కోరితే అది ఇస్తాడు. మనం హృదయగుహలోనికి ప్రవేశించకపోతే మనం కోటిజన్మలు ఎత్తినా మనకు జ్ఞానం కలిగే ప్రశ్నలేదు. ఎక్కడ జ్ఞానం ఉందో, ఎక్కడ శాంతి ఉందో అక్కడకు మనం వెళ్లవలసిందే. హృదయగుహలోనికి వెళ్లటానికి మనకు అభాస్యం, వైరాగ్యం ఉండాలి. అభ్యాసం, వైరాగ్యం, సజ్జన సాంగత్యం, సాధన ఇవిఏమీ లేకుండా మనం హృదయగుహలో ప్రవేశించలేము. హృదయగుహలో ప్రవేశించకపోతే జ్ఞానం సాధ్యంకాదు. నువ్వు కానిదానిలో నుండి విడుదలపొందకపోతే నువ్వు ఏదిగాఉన్నావో అది నీకు ఎరుకలోనికి రాదు, అది నీవే అయినప్పటికి అది నీకు ఎరుకలోనికిరాదు. మనం మామిడిచెట్టువేస్తే మామిడిపండుకాస్తుంది, అలాగే వైరాగ్యం అనే వృక్షానికి కాసేపండు ఆత్మజ్ఞానం. ఎక్కడ గడ్డిమేటు కనిపిస్తే ఈగడ్డిమేటు మనకు ఉంటే బాగుండును, ఏది కనిపిస్తే అది మనకు ఉంటే బాగుండును అని మనం అనుకొంటూ ఉంటే ఇంక మనకు వైరాగ్యం ఎలా వస్తుంది.

నువ్వు ఒక రూపానికి, ఒక నామానికి పరిమితమై ఉన్నావు. ముందు ఈ రెండింటిలో నుండి నీవు విడుదలపొందాలి. వీటిలోనుండి విడుదలపొందాలంటే ఒక అవతార పురుషుడునో, గురువునో ఆశ్రయించాలి. భగవాన్ అరుణాచలేశ్వరుడితో ఏమన్నారు అంటే లోకం యొక్క మోహం పోవటానికి నీ మోహంలోపడ్డాను. నీమీద ఉన్న మోహం కూడా పోతేగాని తత్వం నాకు తెలియదు. నీ మీద నాకు ఉన్న మోహం నీవే పోగొట్టాలి. నీ మీద ఉన్న మోహం నీవు తొలగించవు అనుకో నాకు తత్వం తెలియదు. తత్వం తెలిస్తేనేగాని జ్ఞానంరాదు. దేనికోసమైతే నువ్వు అన్వేషిస్తున్నావో, దేనికోసమైతే నీవు జపతపములు

చేస్తున్నావో అది నీవే అన్న సంగతి నీకు తెలియాలి, అదే తత్వం. నువ్వు ఏదిగా ఉన్నావో అది నీకు తెలియబడాలంటే జ్ఞానిని ఆశ్రయించు. జ్ఞానిని అడిగేటప్పుడు గౌరవంగా అడగాలి, ఆయన మీద నమ్మకంతో అడగాలి, ఆయన హృదయంలో ఉన్న జ్ఞానసముద్రం పొంగాలి, అది నీవు జుర్రుకోవాలి. నువ్వు అడిగే ప్రశ్న వినయంగా, హృదయపూర్వకంగా, నిండు మనస్సుతో అడగాలి, గురువుకు చెప్పే ప్రేరణ కలగాలి. గురువు అవసరాలు ఏమిటో చూస్తూ ఉండాలి. కొంతమంది భక్తులు ఎలాగ ఉంటారు అంటే గురువుకు మంచినీళ్ళు కావాలనుకోండి, నాకు మంచినీళ్ళు కావాలని గురువు చెప్పనక్కరలేదు వీరికి తెలుస్తుంది, అటువంటి భక్తులు కూడా ఉంటారు. గురువుతో అంత తాదాప్యం పొందినవారు ఉన్నారు. వారు జ్ఞానం గురించి అడగనక్కరలేదు, వారికి ఇవ్వబడుతుంది. నరేంద్రుడిని చూసేటప్పటికి రామకృష్ణుడికి గొప్ప సంతోషం వచ్చేసేది. శరీరం విడిచిపెట్టే రోజున రామకృష్ణుడు అంటాడు నరేన్ నేను చేసిన సాధన, నా పుణ్యం అంతా నీకు ఇచ్చేసి నేను పేదవాడిని అయిపోయాను అన్నాడు. గురువు యొక్క అనుగ్రహానికి పాత్రుడైనప్పుడు గురువు నోటి ద్వారా వచ్చే మాటకూడా అనుగ్రహమే, ఆ అనుగ్రహమే తీసుకొనివెళ్ళి నిన్ను హృదయగుహలో పడేస్తుంది. ప్రధానమంత్రి దగ్గరకు వెళ్ళి ఏవండీ మాకు ఇంట్లో తుడుచుకోవటానికి చీపిరిలేదు, చీపిరికట్ట ఇవ్వండి అని అడగటం ఎలా ఉంటుందో అలాగే దేవుడిని జ్ఞానం అడగటం మానివేసి ఏవో చిల్లర కోరికలు అడగటం అలా ఉంటుంది అని స్వామీజీ అన్నారు. నువ్వు జపం చేయగా చేయగా కొంతకాలానికి నీకు తెలియకుండగానే రూపబుద్ధి, నామబుద్ధి వేరుతో సహానశిస్తుంది, అప్పుడు జ్ఞానసముద్రంలో ఐక్యమవుతావు.

ఈ రోజు గురువులనందరిని స్మరించుకొంటూ అంటే వ్యాసుడు, బ్రహ్మాదేవుడు, దక్షిణామూర్తి, వశిష్ఠుడు, శుకుడు ఇలా పెద్దలనందరిని స్మరించుకొంటూ మన గురువును కూడా స్మరించుకోవాలి. గురుపూర్ణిమ ఎందుకు ఏర్పాటు చేసారు అంటే కనీసం ఆ రోజున గురువును గౌరవించటానికి, గురువుతో అనుబంధం పెంచుకోవటానికి మన పెద్దలు ఏర్పాటు చేసారు. అజ్ఞానంలోనుండి జ్ఞానంలోనికి, అసత్యంలోనుండి సత్యంలోనికి, బంధంలోనుండి మోక్షంలోనికి తీసుకొని వెళ్ళేవాడు గురువుమాత్రమే. దేహం చనిపోయినప్పుడు బంధువులతో, స్నేహితులతో అందరితో సంబంధం తెగిపోతుంది కాని గురువుతో సంబంధం తెగదు.. ఈ మాట చెప్పటానికి భగవాన్ పులినోటిలో పడ్డ మాంసపుముక్క అన్నారు. పులినోటిలో పడ్డ మాంసపుముక్కను ఎలా తీయలేమో అలాగే గురువుయొక్క అనుగ్రహంలో పడ్డవాడు ఏదో జన్మలో తరింపబడతాడు తప్ప అందులోనుండి ఎస్కేప్ అవ్వటానికి అవకాశంలేదు. మీరు ఒకవేళ గురువును విడిచిపెట్టినా గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు. దేవుడు చెరకుగెడ అయితే అందులో ఉన్న రసం గురువు. చెరుకుగెడలో పైపెచ్చు, పీచు, ఎక్కడో రసం ఇవి అన్నీ ఉంటాయి. అంటే దేవుడిలో అన్నీ ఉంటాయి. కాని గురువులో ఇవి ఏమీ ఉండవు, చెరుకుగెడలో ఉన్న రసమే గురువు. దేవుడు ఒకవేళ శిక్ష వెయ్యటానికి చూసినా గురువు మిమ్మల్ని తప్పించటానికి చూస్తాడు, వాడు గురువు, ఒకడు పొరపాటు చేసి వచ్చి బాబాగారి దగ్గర కూర్చొన్నాడు. అతనిని పట్టుకోవటానికి వచ్చినవాడు కూడా బాబాగారి దగ్గర కూర్చొన్నాడు. బాబాగారి దగ్గర నుండి బయటకు వచ్చినప్పుడు పట్టుకొందాము, ఆయన దగ్గర ఈ గొడవ ఎందుకు అనివాడి ఉద్దేశం. పొరపాటుచేసినవాడు బాబా పాదాలను వదలకూడదని అక్కడే కూర్చొన్నాడు, ఇద్దరూ కదలటంలేదు, గురువుయొక్క దయ ఎలా ఉంటుందో దానికోసం ఈ ఉదాహరణ చెపుతున్నాను. అప్పుడు బాబాగారు కలుగజేసుకొని పొరపాటు చేసినవాడిని నువ్వు భోజనం చేసి వెళ్ళిపో అన్నారు, పట్టుకోవటానికి వచ్చినవాడిని నువ్వు రెండు రోజులు ఇక్కడే ఉండి వెళ్ళు అన్నారు. పొరపాటు చేసినవాడు ఇంటికి వెళ్ళిపోయి మరుసటిరోజున మేజిస్ట్రేట్ దగ్గరకు వెళ్ళి నేను చిన్న పొరపాటు చేసాను అన్నాడు. మనం ఎవరినైతే పట్టుకోమని పంపామో వాడే ఇది అంతా చేసాడు అని మేజిస్ట్రేట్ అనుకొని వాడికి రూ. 1000 పెనాలటీ వెయ్యవలసింది కాని రూ. 50 కట్టి వెళ్ళిపో అన్నారు. రెండోవాడు బాబా దగ్గర నుండి రెండు రోజుల తరువాత వస్తాడు. వాడిని చూడగానే మేజిస్ట్రేట్ మీకు పురమాయించిన పని బాగానే అయిపోయింది అన్నారు. అంటే బాబాగారు ఇద్దరిని సేవ్ చేసారు ఇద్దరికి సుఖాంతం అయ్యింది. గురువు యొక్క కృప అటువంటిది, ఇది గురువుకే సాధ్యం. గురువు యొక్క దయలేకుండా బ్రహ్మానుభవం కలుగదు. కేవలం పుస్తకాలు చదివి జ్ఞానం సంపాదించేద్దాము అని అనుకోవటం ఎటువంటిది అంటే లక్కతో తయారు చేయబడిన మామిడిపండును నోట్లో పెట్టుకొని రసం పీల్చటం వంటిది. మనం జ్ఞానం పొందటానికి తగిన అర్హత, యోగ్యత గురువే పట్టిస్తాడు. ప్రారబ్ధాన్ని భరించే శక్తిని కూడా ఆయనే ఇస్తాడు, అన్నీ ఇచ్చి మోక్షాన్ని కూడా ఇస్తాడు, వాడు గురువు, బయట ఉన్న చీకటిని సూర్యుడు తొలగిస్తాడు, మన లోపలఉన్న చీకటి అంటే అజ్ఞానాన్ని తొలగించేవాడు గురువు. గురువు అంటే జ్ఞానసూర్యుడు.

| సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు | | |
|---|---|---|
| 25-07-2004 | ఆదివారం | పాలు పేట (వయా) జువ్వలపాలెం, ఏలూరుపాడు భీమవరం నుండి పెదలంక లేదా మూలలంక బస్సులు వెళతాయి. |
| 01-08-2004 | ఆదివారం | ఐ. భీమవరం, శివాలయం వద్ద |
| 08-08-2004 | ఆదివారం | శ్రీరమణక్షేత్రం, జిన్నూరు |

## రమణ భాస్కర సంవత్సర చందా రు. 150/-

ఎడిటర్ **పెన్మెత్స శ్రీరామరాజు** గారికి
**శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు - 534 265, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్**

రమణ భాస్కర సంవత్సర చందా (ది. 20-9-2004 నుండి ది. 05-9-2005 వరకు) నిమిత్తం రూ. 150/-లు పంపుచున్నాను. (ఈ కూపను పూర్తి చేసి పంపించండి)

పేరు .......................................................................................
తండ్రి / C/o. .......................................................................................
డోర్ నెం.........................వీధి / రోడ్ నెం.........................................
గ్రామం ................................. పిన్ కోడ్ .........................................
మండలం ............................... జిల్లా....................... ...................
డి.డి./యమ్.ఓ./నగదు ...............................................................
ఫోన్ (STD కోడ్‌తో సహా)..................... .........................................

రమణభాస్కర పత్రికకు అడ్రస్సు సరిగా ఇవ్వని కారణంగా చాలా పుస్తకాలు తిరిగి వచ్చుచున్నవి. రమణభాస్కర అందకపోయిన, మీ అడ్రస్సు మారిన, వెంటనే మీ పేరు ముందు ఉన్న నెంబరును వ్రాస్తూ డోర్ నెంబరు, వీధి పేరు, ఏరియా, పిన్‌కోడ్‌తో సహా సరియైన పూర్తి చిరునామా మాకు వ్రాయండి. వెంటనే పంపబడతాయి.



**పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్‌లో**
**విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 107వ జయంతి ఉత్సవ ఛాయచిత్రాలు**



**శ్రీ మంతెన వెంకట సూర్య సుబ్బరాజు, Ex, MLA కొత్తపేట మరియు జస్టిస్ నడింపల్లి సుబ్బరాజు, హైదరాబాద్ గార్లను సన్మానిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు**



**మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు**